బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన కొండూరు నేతలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మర్రిగూడ,జూన్ 17 :బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోమవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారికి శాలువాలు కప్పి ఆశీర్వదించారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

కేసీఆర్‌ను కలిసిన వారిలో గ్రామశాఖ అధ్యక్షుడు వల్లపు సైదులు యాదవ్, మాజీ సర్పంచ్ పర్వతాలు, సీనియర్ నాయకుడు మట్టిపల్లి నర్సింహ, శివకుమార్, మండల పెద్దులు ఉన్నారు.

అన్ని రంగాల్లో నల్లగొండ అభివృద్ధికి కృషి



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- ఉదయసముద్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తా
- ప్రమాదాల నివారణకు సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు
- దేవరకొండ రోడ్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తాం
- నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నీలగిరి, జూన్ 17: నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు, ఉదయ సముద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని నల్లగొండ ఎమ్మెల్యే, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పానగల్ ప్లై ఓవర్ సర్వీస్ రహదారిలో రూ.5.5 కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డ్రైనేజీ లైన్ తీయకుండా హడావుడిగా పనులు పూర్తి చేశారన్నారు. ఈ డ్రైనేజీ పనులు చేయకపోవడం వల్ల పానగల్ ప్లై ఓవర్ వద్ద ఇబ్బందులు తలెత్తాయని ఇందుకోసం రూ. 5.5 కోట్లు మంజూరు చేయించి భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఎంత వర్షం వచ్చినా చుక్క నీరు నిల్వకుండా చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిని పట్టణంలో నుంచి తీసుకెళ్లడం ద్వారా రామాలయం, చర్చి, ఆంజనేయస్వామి గుడి, కబరస్తాన్, దేవరకొండ రోడ్ లోని షాపులు వంటివి కోల్పోతున్నారని గ్రహించి రూ.700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోకి హెవీ వాహనాలు రాకుండా ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి వెళ్లేలా పనులు ప్రారంభించబోతున్నామని చెప్పారు. దీంట్లో భాగంగానే పానగల్ వద్ద ఛాయా సోమేశ్వరాలయం సమీపంలో ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ఉదయ సముద్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. చందనపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

దేవరకొండ రోడ్‌లో ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటుకు ప్రతిపాదనలు

దేవరకొండ రోడ్‌లోని సెయింట్ ఆల్ఫాన్సెస్ హైస్కూల్ వద్ద ప్రతిరోజు 6వేల మంది విద్యార్థులు వస్తుంటారని, వారు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారని ఇందు కోసం ప్రత్యేకంగా ఎస్కలేటర్‌తో కూడిన ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నల్లగొండ అవుటర్ రింగ్ రోడ్డు కింద భూములు, ఇండ్ల స్థలాలు కోల్పోయే వారికి మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించడమే కాకుండా, ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలను కేటాయిస్తామన్నారు. పట్టణంలో ప్రమాదాల నివారణకు పటిష్ట సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, కౌన్సిలర్లు అలకుంట్ల రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

మిర్యాలగూడ, జూన్ 17: పట్టణంలోని గీతా మందిర్ శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ చక్రవర్తుల సుధాన్వాచార్య ఆధ్వర్యంలో సుదర్శన నర్సింహ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే సాయంత్రం పుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు శ్రీమాన్ చక్రవర్తుల శుభానాచార్య స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బండారు కుశలయ్య మాట్లాడుతూ ఐదు రోజులపాటు నిర్వహించిన ఆలయ ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

- 6 కిలోల గంజాయి, 46 వేల నగదు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు

మిర్యాలగూడ, జూన్ 17: గంజాయి విక్రయిస్తున్న 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లాకు దాచేపల్లి మండలానికి చెందిన సాకేటి తిరుపతి నారంనాయుడు, సాకేటి పోలినాయుడు వీరిరువురు, విశాఖపట్టణం జిల్లా పాడేరుకు చెందిన బాబ్జి వద్ద గంజాయి కొనుగోలు చేసి బస్సుల్లో, రైళ్లలో దాచేపల్లికి తరలించి అక్కడి నుంచి దామరచర్ల, మిర్యాలగూడ ప్రాంతాలకు చెందిన యువకులకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం దామరచర్ల మండలం బొత్తలపాలెం శివారులో రైల్వే అండర్ పాస్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు వాడపల్లి పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ రవి సిబ్బందితో కలిసి వెళ్లి తిరుపతి నారంనాయుడు, పోలినాయుడుతోపాటు అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యానికి చెందిన కొంగ ప్రకాశ్, పాలకవీడు మండలం శూన్యంపాడుకు చెందిన నందిపాటి నవీన్, దామరచర్లకు చెందిన సిగపట్ల మహేశ్, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కలిమెల కిశోర్, దామరచర్ల మండలం వీరభద్రపురానికి చెందిన తురక రమేశ్, మిర్యాలగూడ పట్టణం షాబునగర్‌కు చెందిన కంగోజు కార్తీక్, రెడ్డికాలనీకి చెందిన జగతికుమార్, ఈదులగూడేనికి చెందిన జగతి కోటేశ్, షాబునగర్‌కు చెందిన షేక్ ఖాజా, శాంతినగర్‌కు చెందిన ముడాపత్ రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వారి నుంచి 6 కిలోల గంజాయి, రూ.46 వేల నగదు, మూడు మోటార్ సైకిళ్లు, 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 12 మందిని కోర్టులో రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితులు సాకేటి తిరుపతి నారంనాయుడు, సాకేలి పోలినాయుడును రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐలు సుధాకర్, నాగార్జున, వీర బాబు, ఎస్ఐలు రవి, విజయ్‌కుమార్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్‌గాహ్, మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి , అధికారులు, వివిధ పార్టీల నేతలు ప్రముఖులు



నకిరేకల్‌లో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామగిరి, జూన్ 17: బక్రీద్‌ను ముస్లింలు జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని ప్రాంతాల్లో ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాకేంద్రంలోని మునుగోడు రోడ్‌లోని ఈద్‌గాహ్ వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక ప్రార్థనలు చేశారు. మత గురువు సయ్యద్ మౌలానా ఎహనోద్దీన్ పండగ విశిష్టితను వివరించారు.అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు ..

మునుగోడు రోడ్‌లోని ఈద్‌గాహ్ వద్ద జరిగిన ప్రార్థనల్లో రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోఫి గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్పీ చందనాదీప్తి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఏఎస్పీ రాములునాయక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, ఆర్డీఓ రవి, తాసీల్దార్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మీ, వివిధ పార్టీల నేతలు సయ్యద్ హాశం, వంగల అనిల్ రెడ్డి, కౌన్సిలర్లు ముస్లింలకు శుభాంకాక్షలు తెలిపారు. వీరితోపాటు పీస్‌కమిటి సభ్యులు అఫీజ్‌ఖాన్, డీఎస్పీ శివరాంరెడ్డి, ముస్లిం నాయకులు, పలువురు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల భారీ బందోబస్త్.

ఈద్గా వద్ద ఎస్పీ ఆదేశాలమేరకు డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే ఈద్‌గాహ్ వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి అనుమతించారు. ఉదయం 8:30 తరువాత అటువైపు వెళ్లే వాహనాలను దారి మళ్లి ఇబ్బంది లేకుండా చూశారు.

తిప్పర్తి మండలకో ఆప్షన్ సభ్యుడు సోహెల్ అన్సారీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ నల్లగొండ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు, సయ్యద్ జాఫర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు గోపి, కందుల లక్ష్మయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ముస్లింలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుభాకాంక్షలు

మిర్యాలగూడ : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బక్రీద్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి స్థానిక మసీద్ కమిటీ అధ్యక్షుడు పాషా గృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ సమస్య మానవాళికి ఆదర్శనీయమన్నారు.కార్యక్రమంలో ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లలితాహాతీరాంనాయక్, గుడిపాటి సైదులుబాబు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి ఈద్‌గాహ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కట్టంగూర్ : అయిటిపాములలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, పోలీసులు

నిడమనూర్: ముకుందాపురంలో..

మర్రిగూడలోని ఈద్‌గాహ్ దగ్గర ప్రార్థన అనంతరం బయటికి వస్తున్నముస్లింలు

శాలిగౌరారం: వల్లాలలో ..

అడవిదేవులపల్లిలో..

నల్లగొండలోని మునుగోడు రోడ్‌లో ఈద్‌గాహ్ వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

నార్కట్‌పల్లి : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నేతలు

కేజీబీవీలో ఉమెన్ వాచ్‌మన్ పోస్టుకు ఇంటర్వ్యూ

కట్టంగూర్, జూన్ 17 : కట్టంగూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డే వాచ్‌మన్ (మహిళ)పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19న పాఠశాలలో త్రీ మెన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంతఓ మేక నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాచ్‌మన్ పోస్టు భర్తీ కోసం గత సంవత్సరం మే 26న అర్హులైన వారు నుంచి దరఖాస్తులు స్వీకరించి అనివార్య కారణలతో భర్తీ చేయలేకపోయామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ, జూన్ 17: పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ శాంతినగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేతతో పాటు ఇతర మరమ్మతు పనులు ఉన్నందున మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఫీడర్ పరిధిలోని శాంతినగర్, సంతోష్‌నగర్, కృష్ణకాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడటౌన్, జూన్ 17 : మిర్యాలగూడ ఆర్టీసీలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు 9959 226308 నంబర్‌కు ఫోన్ చేసి మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలపాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడ్, జూన్ 17: మండలంలోని తేనేపల్లి గ్రామంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన తాళ్ల శేఖర్ తేనేపల్లి గ్రామానికి చెందిన యాదయ్య సాయంతో అక్రమంగా తరలిస్తున్న 9.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కట్టంగూర్, జూన్ 17 : మండలంలోని అయిటిపాములలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన బెల్లి నర్సింహ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 15న రాత్రి ఇంటి స్లాబ్‌పై పడుకున్నారు. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న తులంన్నర బంగారు నగలు, 20తులాల వెండి అపహరించుకుపోయారు. బాధితుడు నర్సింహ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎన్.శ్రీను తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

బోయగూడెంలో మట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 17: గ్రామాల అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం గ్రామంలో సీడీపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న మట్టి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి, నాయకులు కూన్ రెడ్డి లింగారెడ్డి, మాలె సత్యంరెడ్డి, పొదిల మల్లయ్య యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, జలంధర్‌రెడ్డి, నెమలి మల్లారెడ్డి, సత్యంరెడ్డి, బండి రమేశ్ పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమార్, మురళీధర్

రామగిరి, జూన్ 17: రాష్ట్రంలో ఉన్న అన్ని చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వనం శాంతి కుమార్ ,గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి కొమురయ్య భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి చూపిస్తున్నది చేనేత రంగమే అన్నారు. చేనేత రంగాన్ని కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాలు ప్రకటించకపోగా చేనేతకు ఉపయోగపడే హ్యాండ్లూమ్ ,పవర్‌లూమ్ బోర్డ్, మహాత్మా గాంధీ బున్కల్ యోజన పథకాన్ని రద్దు చేసిందని విమర్శించారు. 2013 ఫిబ్రవరిలో జరిగిన సహకార సంఘాలకు ఐదేండ్ల కాలపరిమితి ముగిసిన ఆరు నెలలకు ఒకసారి పర్సనల్ ఇన్‌చార్జిలను నియమించి వారి పదవీ గడువు పొడిగించడం వల్ల సహకార సంఘాలు నిర్వీర్యమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎలాంటి షరతులు లేకుండా అన్ని సంఘాలకు సహకార ఎన్నికల నిర్వహించి బడ్జెట్లో నిధులు కేటాయించి సంఘాల బలపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ పవర్ టూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సంఘం నాయకులు రాపోలు రాములు, రాపోలు వెంకన్న, కర్నాటి శ్రీరంగం, గడ్డం దశరథ, వలిగొండ మధు, బొల్లు రవీంద్ర కుమార్, శివ పాల్గొన్నారు

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మునుగోడు, జూన్ 17 : మండల కేంద్రంలోని చండూర్ రోడ్డులో సర్వే నంబర్ 78లో గల గత ప్రభుత్వం 20 గుంటల భూమిరి చేనేత సంఘానికి కేటాయించినది. ఇందులో కొంత భూమి ఆక్రమణకు గురైందని స్థానిక చేనేత సంఘం సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి భూమిని సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆ భూమిని తాసీల్దార్ సర్వే చేయించి ఆ సంఘానికి సంబంధించిన 20 గుంటల భూమికి హద్దులు పాతి, అలాగే ఆక్రమణకు గురైన భూమి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ నరేందర్, ఆర్ఐ నాగరాజు, సర్వేయర్, చేనేత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చందంపేట సమగ్రాభివృద్ధికి కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

తెల్దేవర్‌పల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభంలోపాల్గొన్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట, జూన్ 17 : మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, గ్రామ ఆర్చ్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్కలగండి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఒ

కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీచందునాయక్, జడ్పీటీసీ బుజ్జిలచ్చిరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, శ్రీశైలంయాదవ్, ముత్యాల సర్వయ్య, గోవిందుయాదవ్, మల్లారెడ్డి, గిరి, మహాలక్ష్మి, జైపాల్‌రెడ్డి, హరి కృష్ణ, నారాయణ, శ్రీను, భరత్, నాగార్జున, దేవానాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి : సీపీఎం

చిట్యాల : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చిట్యాల, జూన్ 17 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. పట్టణంలోని మేకల లింగయ్య సార్మక భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సాంకేతిక కారణలతో హామీలను అమలు చేయడంలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ మేరకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డు, సన్నాలు అనే తేడా లేకుండా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం హామీల అమలు చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, నాయకులు శీల రాజయ్య పాల్గొన్నారు.

విత్తనాలు అందక రైతుల్లో ఆందోళన

నిడమనూరు, జూన్ 17 : వానకాలం సీజన్ ప్రారంభమైనా రైతులకు విత్తనాలు సక్రమంగా అందని కారణంగా ఆందోళనకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఎరువులు, పురుగు మందుల కొరత కారణంగా రైతాంగం ఇబ్బందులకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్, సీనియర్ నాయకుడు కత్తి లింగారెడ్డి, కొమాండ్ల గుర్వయ్య, నల్లబోతు సోమయ్య, ఆకారపు నరేశ్, చంద్రశేఖర్, శివ, బాలనారాయణ, కేశవులు తదితరులున్నారు.

హామీలను అమలు చేయాలి

శాలిగౌరారం : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో హామీలను అమలు చేయడంలో వేగం పెంచి ప్రజలకు అందించాలన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుబంధుతో పాటు పండించిన పంటలకు బోనస్, రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చెలకాని మల్లయ్య, నాయకులు కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, బుచ్చి రాములు, పైదులు పాల్గొన్నారు.